

త్యోద్యమం, సంఘ సంస్కరణోద్యమం, సాహిత్యోద్యమం కలిసి ప్రవహించాయి. ప్రముఖ విశ్లేషకులు పి.వేణుగోపాలస్వామి చెప్పినట్టు తెలంగాణలో ఉద్యమానికీ, సాహితీ వ్యాసంగానికీ తేడా ఉండదు. చరిత్ర రచయితలపై ఉద్యమ బాధ్యతను కూడా పెట్టింది. వారిని నిజమైన కవులుగా నిలబెట్టింది. కాళోజీ, దాశరథి, వట్టికోట లాంటివారంతా సాహితీవేత్తలు మాత్రమే కాదు. ఉద్యమకారులుగా పోరాడారు. అంతే తప్ప ఉద్యమం బయట ఉండి ఊగిపోలేదని అంటారు. అలా ఒక సంక్షోభ కాలంలో, ఒక నూతన యుగారంభంలో చిచ్చర పిడుగై తలెత్తినాడు దాశరథి.

1942లో కమ్యూనిస్ట్ పార్టీ నిర్వహించిన సెల్ సమావేశాలకు దాశరథి హాజరయ్యారు. గార్ల, గొల్లగూడెం, కారుముంతల జాగీర్దారీ వ్యతిరేక రైతాంగ పోరాటాలలో ప్రముఖ పాత్ర పోషించారు. 1946లో కమ్యూనిస్టు పార్టీ ఆరంభించిన సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. దాశరథిలోని నిప్పు దావానలమై తిరుగుబాటు లేపుతుందని భయపడిన అధికారులు ఆయనపై అమానుష హత్యా ప్రయత్నాలకు తెగబడ్డారు.

## అజరామరం..
## ఆ చల్లని సముద్రగర్భం

దాశరథి రాసిన పాటల్లో 'ఆ చల్లని సముద్ర గర్భం/ దాచిన బడబానలమెంతో' అనే పాట అత్యంత ప్రసిద్ధి చెందింది. చారిత్రిక భౌతికవాదానికి సమున్నత కవితా రూపం ఇచ్చిన శ్రీశ్రీ 'దేశచరిత్రలు' కవితతో సరితూగే గీతమిది. అభ్యుదయ తాత్విక చింతనకు పతాక స్థాయిని ఇచ్చిన పాట ఇది. సముద్రంలో అలల్లాగా ఒక్కో చరణం ఎగిసిపడుతాయి. ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో అన్న ఆ ఒక్క వ్యక్తీకరణలో మానవ చరిత్ర పొడుగునా పేరు నోచని అజ్ఞాత త్యాగాలెన్నో కదా అని స్ఫురించి హృదయం ద్రవీభూతమై పోతుంది. 'పసిపాపల నిదుర కనులలో ముసిరిన భవితవ్యం ఏదో, గాయపడిన కవి గుండెలలో రాయబడని కావ్యాలెన్నో' అనే అద్భుతమైన కవితా వాక్యాలు ఈ గేయభావాన్ని అత్యున్నత స్థాయికి చేరుస్తాయి. సార్వజనీనం, సార్వకాలికమైన మానవ దుఃఖాన్ని అనుభూతింప చేస్తాయి. కాలగతిలో కవి వ్యక్తం చేయలేకపోయిన మానవ జీవన సంవేదన మనల్ని ఆవహిస్తుంది.



## దాశరథి కావ్య కుసుమాలు

- అగ్నిధార
- రుద్రవీణ
- అమృతాభిషేకము
- ఆలోచనాలోచనలు
- ధ్వజమెత్తిన ప్రజ
- తిమిరంతో సమరం
- గాలిబ్ గీతాలు
- జ్వాలా లేఖిని
- మహాంధ్రోదయం
- మహాబోధి
- మార్పు నా తీర్పు
- కవితా పుష్పకం

ఇలా మరెన్నో...



సన్మాన సంబురం..





నేరెళ్ల వేణుమాధవ్‌తో..

గూడూరులో తాతగారి ఇంట భోజనం చేస్తుండగా పోలీసులు గిరఫ్తార్ అన్నారు. నెల్లికుదురు తీసుకుపోయారు. అయితే, దాశరథి జైలులో బావర్చీని మచ్చిక చేసుకొని తప్పించుకున్నారు. నిజాం సైనికులు తరుముతుండగా పొలాలలో, అరణ్యాలలో, నదులలో పడి పరుగెత్తారు.

ఆ విప్లవ ఝంఝూమారుతంలో ఇక్బాల్ కవిత ఆయనకు వజ్రాయుధంలా తోడ్పడింది.

### కారాగారంలో కవిత్వం

**ఇది నిదాఘము; ఇందు సహింపరాని**
**వేడి పుట్టించుచున్నది; పాడుపడిన**
**గోడలందున జైలులో పాడినాడ**
**వాడిపోనున్న పూమొగ్గపై పాట**

తెలుగుదేశంలో ఆనాటికి ఏ కవీ ఎదుర్కోని, ఎదుర్కొనడానికి ఇష్టపడని, సాహసించని చాలా దుర్భరమైన ప్రభుత్వ నిర్బంధాన్ని దాశరథి ఎదుర్కొన్నాడు. ఆ నిర్బంధం చాలు అతని కీర్తిని మొత్తం వెలిగించడానికని అంటారు ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు కె.శ్రీనివాస్. ప్రజల తిరుగుబాటుపై దాశరథి ప్రభావాన్ని గమనించిన ప్రభుత్వం వరుసగా జైళ్లను మార్చింది. మొదట వరంగల్ సెంట్రల్ జైలు, నిజామాబాద్ జైలు, తర్వాత హైదరాబాద్ చంచల్ గూడా జైలుకు మార్చారు.